క్లుప్తంగా

బాపట్ల ఎమ్మెల్యేని కలిసిన ఎస్సీ సెల్ అధ్యక్షుడు



ఎమ్మెల్యే రఘుపతికి బొకే ఇస్తున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాబురావు

చినగంజాం: బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాటుకూరి బాబురావు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కోన రఘుపతిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు బొకే అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. జిల్లాలో మండలాల వారీగా పార్టీ ఎస్సీ సెల్ కమిటీలను ఏర్పాటు చేసే విషయమై ఆయనతో చర్చించారు. జిల్లా అధ్యక్షుడిగా తాను కమిటీలను ఏర్పాటు చేసేందుకు జిల్లా అంతటా పర్యటించనున్నట్లు వివరించారు.

నరసింహస్వామికి వెండి వస్తువులు బహూకరణ



వెండి వస్తువులు బహూకరిస్తున్న శ్రీమన్నారాయణ

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండలోని కొండపై వేంచేసియున్న లక్ష్మీనరసింహస్వామి వారికి అద్దంకి వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్ని శ్రీమన్నారాయణ 800 గ్రాముల వెండి దీపపు హారతి, ధూపపు చిమ్మీ, వెండి వస్తువులు దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ నర్రావుల కొండలుకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి సన్నిమెళ్ల కోటిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సిబ్బంది, చిన్ని శ్రీమన్నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ సేవలు అభినందనీయమని పట్టణ సీఐ రోశయ్య అన్నారు. రోటరీ క్లబ్ మెడికల్ క్యాంపు చైర్మన్ కాకాని రాధాకృష్ణమూర్తి సౌజన్యంతో ఆదివారం ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో రోగులకు శంకర్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ మంజూత్ కౌర్, డాక్టర్ సుస్మిత, ఎం రవికుమార్‌లు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, వీరవల్లి సుబ్బారావు, ఉబ్బా దేవపాలన, లెవీ ప్రసాద్, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, నర్రా శ్రీలక్ష్మి, వీరవల్లి సుబ్బారావు, కొల్లా భువనేశ్వరి, చందలూరి కృష్ణ, గాడేపల్లి దివాకరదత్తు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బాలనాగేంద్ర స్వామి తిరునాళ్లు



అలంకరణలో బాలనాగేంద్రస్వామి

కారంచేడు: మండలంలోని ఆదిపూడిలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత బాల నాగేంద్ర స్వామి వారి 36 వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో పెద్ద ఎత్తున తిరునాళ్ల నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి గ్రామంతో పాటు సమీప గ్రామాలైన యర్రంవారిపాలెం, తిమిడెదపాడు, పూసపాడు, నూతలపాడు, సుబ్బారెడ్డిపాలెం, కుర్రప్పాలెం, వంకాయలపాడు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తిరునాళ్లకు వచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ, యూత్ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అద్దంకి రూరల్: దామోదరం సంజీవయ్య 51వ వర్ధంతి కార్యక్రమాన్ని మాలమహానాడు అద్దంకి నియోజకవర్గం అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటాకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో రమేష్, అంకమ్మరావు, రాజశేఖర్, శ్రీను, బాబు,వీరు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

- రొంపేరులో ముందుకు సాగని చేపలవేట
- తూటుకాడ, గుర్రపు డెక్కతో వేటకు ఆటంకం
- పట్టించుకోని అధికారులు



రొంపేరులో పెరిగిపోయిన గుర్రపుడెక్క

తూటుకాడ.. ఇబ్బందులకు జాడ

చినగంజాం: మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న రొంపేరు కాలువలో చేపల వేట ముందుకు సాగక మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. తూటుకాడ, గుర్రపుడెక్కతో పూర్తిగా రొంపేరు కాలువ నిండిపోవడంతో మత్స్యకారులకు వేట చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. మండలంలోని వందలాది కుటుంబాలు రొంపేరు కాలువలో వేట చేసుకొని జీవనోపాధిని పొందుతున్నారు. తీరం వెంబడి గ్రామాల్లోని మత్స్యకారులు సముద్రంపై ఆధారపడి వేట చేసుకునే వారు కాగా, మండలంలోని మిగిలిన గ్రామాల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల కుటుంబాల ప్రజలు రొంపేరు కాలువపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు.

జీవనోపాధికి ఆటంకం..

సముద్రతీర ప్రాంతేతర గ్రామాలైన గొనసపూడి, కడవకుదురు, చింతగుంపల, అమీన్ నగర్, భాగ్యనగర్, రాజుబంగారుపాలెం ఎస్టీ కాలనీ, మహాలక్ష్మి కాలనీ, రామకోటేశ్వర కాలనీ, పోలేరమ్మ కాలనీ, రామచంద్ర నగర్‌లకు చెందిన వందల కుటుంబాలు రొంపేరు కాలువతో పాటు దాని పిల్ల కాలువలలో వేట చేసుకొని మత్స్య సంపదను మార్కెట్ చేసుకోగా తద్వారా సాయంత్రానికి వచ్చిన ఆదాయంతో వారు జీవనోపాధిని పొందుతారు. పూర్తిగా చేపల వేట మీద ఆధారపడిన ఆయా ప్రాంతాల కుటుంబాలు అత్యంత పేదలు. చేపల వేట చేస్తేనే పూట గడవని పరిస్థితి వారిది. పగలు,రాత్రి వేట చేసిన మత్స్య సంపదను మార్కెటింగ్ చేసుకోవడం వారి జీవన విధానం. అర్ధరాత్రి సమయంలో రొంపేరు కాలువలో వేటకు వెళ్లి కళ్లు సైతం పూర్తిగా కన్పించని చీకటి రాత్రిలో, మంచుకన్నా చల్లనైన నీటిలో వలను విసిరి రాత్రంతా అక్కడే ఉండి వేకువ జామున తిరిగి ఇంటికి వచ్చే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఆ సమయంలో వలను విసరే సమయంలో మత్స్యకారుడు ఏ మాత్రం తూటుకాడలో కూరుకుపోతే ప్రాణాలు కోల్పోవడమే. గతంలో పలువురు మత్స్యకారులు వేట చేసేందుకు వెళ్లి తూటుకాడలో వలతో పాటు చిక్కుకొని మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. రొంపేరు కాలువలో జీవనోపాధి వెదుకులాట మత్స్యకారులకు ప్రాణసంకటంగా మారింది.



వలలో చిక్కని చేపలు

అధికారులు, ప్రజాప్రతినిధులు తలచుకుంటేనే..

రొంపేరు కాలువలో చేపల వేట చేసుకొని జీవించే నిరుపేద కుటుంబాలను అధికారులు, ప్రజాప్రతినిధులు తలచుకొని కాలువలో గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకుంటేనే జీవనోపాధి మెరుగుపడే అవకాశం ఉంది. గుర్రపు డెక్క రూపంలో రొంపేరు కాలువలో పేరుకు పోయిన సమస్యను తొలగించకపోతే వందల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. పరిస్థితిలో అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు గుర్రపు డెక్క తొలగించాలి..



రొంపేరు కాలువలో చేపలవేట చేసుకుంటూ వందల కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. గత కొద్ది రోజులుగా కాలువలో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి వేట సాగక ఎంతో మంది అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని గుర్రపు డెక్క ఆకును తొలగించి పేద కుటుంబాలను ఆదుకోవాలి.

– కర్రి ధనరాజులు, మత్స్యకారుడు

వేట సాగక జీవనోపాధి కోల్పోతున్నాం..



రొంపేరు కాలువలో తూటుకాడ విపరీతంగా పెరగడంతో వేట సాగడం లేదు. దాంతో ఉపాధి లేక పూట గడవక పస్తులుంటున్నాం. చేపల వేట లేక పోవడంతో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలి.

కోకి రామిరెడ్డి, మత్స్యకారుడు

డ్రైనేజీ కాలువ పనులు పూర్తిచేయాలి



డ్రైనేజీ కాలువ పనులను పరిశీలిస్తున్న ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

మార్టూరు: డ్రైనేజీ కాలువ పనులు త్వరగా పూర్తిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక జాతీయ రహదారికి తూర్పు వైపున స్టేట్ బ్యాంక్ సెంటర్లో హైవే అధికారులు నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ నిర్మాణాన్ని ఆమంచి పరిశీలించారు. అనంతరం స్థానిక గొట్టిపాటి కిషోర్ కాలనీలో నూతనంగా నిర్మించిన చెంచులక్ష్మి దేవస్థానం ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఆమంచి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీలోని చెంచు సంఘం పెద్దలు మల్ల చిన్న ఓబులు, మల్ల కోటయ్య, వెంకటేశ్వర్లు, ఆవుల శ్రీను, పార్వతయ్య తదితరులు ఆమంచికి ఘన స్వాగతం పలికారు. జొన్నతాళి గ్రామంలో జరుగుతున్న అంకమ్మ తల్లి కొలుపులకు హాజరైన ఆమంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, బాబు నాయక్ గర్నెపూడి, జ్ఞాన సుందర్రావు, రవిచంద్ర, కాకోలు వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి అనిల్, సుగుణరావు, కాకోలు రామారావు, గద్దం మస్తాన్‌వలి, సురేష్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

వేటపాలెం: నూతనంగా ఏర్పాటు చేసిన లే అవుట్ కాలనీల్లో మౌలిక వసతుల కల్పన వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. మండలం పరిధిలోని దేశాయిపేట వద్దగల వివేకానంద కాలనీలో మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలనీలో మంచినీటి సరఫరా, ఎలక్ట్రికల్ లైన్స్, అంతర్గత రోడ్లపై అధికారులతో చర్చించారు. ముందుగా మంచినీటి సౌకర్యం, విద్యుత్ సరఫరాకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కాలనీలో సిమెంట్ రోడ్లు వేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, చల్లా జనార్దన్, దంతం హనుమంతరావు, ఎంపీడీ శర్మ, గవిని వెంట్రావు, కర్ణ లక్ష్మణరావు, పులి సోమయ్య, గద్దం శివయ్య, గద్దం పోలేసు పాల్గొన్నారు.

భాషను కాపాడాల్సిన బాధ్యత అందరిది



మాట్లాడుతున్న సృజన అధ్యక్షుడు

అద్దంకి రూరల్: అంతరించిపోతున్న తెలుసు భాషను కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరత్తు అన్నారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో ఆయన మాట్లాడుతూ పండరంగని పద్య శాసనం అద్దంకి గడ్డమీదే పుట్టిందన్నారు. కవిత్రయంలో ఒకరైన ఎర్రన నడయాడిని భూమి అద్దంకి అన్నారు. విద్యార్థులకు తెలుగు భాష ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సృజన కార్యదర్శి అనిల కుమార సూరి, సృజన ఉపాధ్యక్షుడు ఈఎస్టీసాయి, ప్రచార కార్యదర్శి లెవీ ప్రసాద్, మహమ్మద్ రఫీ, సమ్మర్ క్యాంపు నిర్వాహకులు జేవీవీ డివిజన్ అధ్యక్షుడు తంగా శ్రీనివాసరావు, కావూరి రఘు చంద్, అద్దంకి పోస్టుమాస్టర్ ఆర్వీ రాఘవరావు పాల్గొన్నారు.

ఘనంగా వీర్లంకమ్మ తల్లి కొలుపులు



దైవాలతో గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం గొడవీధిలో లక్ష్మీచెన్నకేశవస్వామి, వీర్లంకమ్మ తల్లి పోతురాజు స్వామి కొలుపులను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న కొలుపుల్లో ఆదివారం వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొలుపులను పురస్కరించుకుని జలబిందెలతో గ్రామోత్సవం, దైవాల గ్రామోత్సవాన్ని మంగళవాయిద్యాలు, యువకుల నృత్యాలతో వైభవంగా జరిపించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొలుపుల వేడుకలను సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు, గొడ సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం

వేటపాలెం: అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జీ. సురేష్ ఆదివారం తెలిపారు. శనివారం బైపాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేసున్న సమయంలో బియ్యం లోడుతో చీరాల నుంచి ఒంగోలు వెళ్తున్న లారీని ఆపి పరిశీలించగా అందులో రేషన్ బియ్యం 110 బస్తాలు ఉన్నట్లు గుర్తిచామని తెలిపారు. లారీని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కి తరలించామని చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా చీరాల్లో రెండు రేషన్ షాపుల వద్ద నుంచి బియ్యం బస్తాలు తీసుకొని ఒంగోలుకు చెందిన హనుమంతరావుకి తరలిస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు స్వాధీనం చేశామని తెలిపారు.

కడవకుదురులో పోలేరమ్మ తిరునాళ్ల

- ఎద్దుల పోటీలు ప్రారంభించిన ఆమంచి



ఎడ్లపోటీలను ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

చినగంజాం: కడవకుదురు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి తిరుణాళ్ల ఆదివారం గ్రామ కాపులు, పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఆలయ 12వ వార్షిక ఉత్సవంలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించే తిరుణాళ్లకు ఆదివారం గ్రామంలోని ప్రతి కుటుంబం సద్ది, వడపప్పు, పానకం తీసుకొని ఊరేగింపుగా మేళ తాళాలతో, డప్పు వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ఊరి పొలిమేరలోని అమ్మవారి ఆలయానికి తీసుకొని వెళ్లి తమ మొక్కులను తీర్చుకున్నారు. దేవస్థాన పూజారి యడవల్లి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయ రీతిలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలురాధా ఎడ్ల పందేలను పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఆదివారం సాయంత్రం పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి పోటీలను ప్రారంభించారు.

బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండలోని బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రానికి ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆదిపూడి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా పుట్టరాజు సాయి, ముక్తినూతనపాడు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పమిటిఘంటం చంద్రశేఖర్, కోశాధికారి ధేనువుకొండ సుబ్బారావు, కార్యవర్గ సభ్యులుగా దామరాజు వేణు గోపాల్‌రావు, పోలంరాజు రమణరావు, ధర్మవరపు సీతారామయ్య మిన్నికటంటి శ్రీరామమూర్తి, డీ. సుబ్రమణ్యం, కె. సుబ్బయ్య, వంగలహరిశంకరావధాని, పీవీ రమణారావు లు ఎన్నికయ్యారు.

అకాల వర్షాలతో రైతుల ఇబ్బందులు



కేవీ పాలెంలో మొక్కజొన్న పొలాలను పరిశీలిస్తున్న ఏవో కుమారి



పంగులూరులో మిర్చి కల్లంపై పట్టా కప్పుతున్న రైతులు

జే.పంగులూరు/బల్లికురవ: అప్పటివరకు ఎండ తీవ్రగా ఉంది.. ఉక్క పోత పోస్తుంది సరిగా మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణ మారిపోయింది. దట్టమైన నల్లని మేఘాలు అలుముకున్నాయి. నిమిషాల వ్యవధిలోని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఆదివారం పడింది. రైతులు మిర్చి కల్లాలు, మొక్కజొన్న గింజలుపై పట్టలు కప్పుకునే లోపే వర్షాం తీవ్రంగా పండింది. ఈ వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు బెంబేలు ఎత్తుతున్నారు. వాతావరణం ఎప్పుడు మారుతుందో ఎప్పుడు వర్షం పడుతుందో అర్థం కాక రైతులు కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నారు.

పంటలను తడవకుండా రక్షించుకోండి

రబీలో సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలను తడవకుండ రక్షించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి సూచించారు. ఆదివారం అంబడిపూడి, వల్లాపలి, కొమ్మినేనివారి పాలెం, వైదన గ్రామాల్లో సాగుచేసిన మొక్కజొన్న, వరి పొలాలను కల్లాల్లో ఉన్న విత్తనాలను ఆమె పరిశీలించారు. మొక్కజొన్న విత్తనాలు మార్క్‌ఫెడ్ ద్వారా అమ్ముకునేందుకు ఈనెల 13వ తేది లోపు ఆర్‌బీకెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం




అల్లూరి విగ్రహానికి నివాళులర్పించిన గ్రామస్తులు

మార్టూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు.. గిరిజన హక్కుల పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాజుగారిపాలెం గ్రామంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఆయన విగ్రహానికి క్షత్రియ యువత నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి పోరాట పటిమను గుర్తుకు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజు, గ్రామస్తులు హాజయ్యారు.

కొనుగోలు కేంద్రాలతో చేయూత

అద్దంకి: మొక్కజొన్న రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మండల వ్యవసాయాధికారి లావణ్య ఆదివారం తెలిపారు. సంతమాగులూరు మండలంలో మొత్తం 3,161 ఎకరాల్లో రబీ సీజన్‌లో మొక్కజొన్నను సాగు చేశారన్నారు. అందులో 2 వేల ఎకరాలకుపైగా రైతులు బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నలను విక్రయించుకున్నారని, ఇంకా 883 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు సంబంధించి మండలంలోని 20 ఆర్‌బీకేల ద్వారా రైతు రిజిస్ట్రేషన్‌తో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మొక్కజొన్నలు విక్రయించుకోదలచిన రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా ఈ నెల 13వ తేదీ లోపుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవలని చెప్పారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు తమ ఆధార్ కార్డు పొలం పాసుపుస్తం, ఫోన్‌నంబరు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రం ద్వారా గోతాలు ఇచ్చి, క్వింటాలకు రూ.1960 ధర ఇస్తారని చెప్పారు. అవకాశాన్ని మొక్కజొన్న సాగు చేసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగండ్లలో నేత్రదానం



గాలి సుబ్బారావు (ఫైల్)

చినగంజాం: ఇంకొల్లు మండలం నాగండ్లలో ఆదివారం మృతి చెందిన గాలి సుబ్బారావు(66) నేత్ర దానంతో రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు అవయవదాన కమిటీ ఆయన కుటుంబ సభ్యులు అంగీకారంతో నిర్వహించిన కార్ని యాల సేకరణతో 499 వ నేత్ర దానం పూర్తయింది. గుంటూరు పెదకాకాని శంకర నేత్రాలయ నేత్ర వైద్యులు డాక్టర్ విపిన్, సిస్టర్ వాణిలు దాత కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులు మరియమ్మ, రాజశేఖర్,ఏమేలమ్మ, సుభాషిణిలను ఇంకొల్లు సెంట్రల్ క్లబ్ రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణలు అభినందించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. ఉత్తరాయణం వైశాఖ మాసం జ్యేష్ట నక్షత్రం తదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అనాథ వృద్ధాశ్రమానికి బియ్యం అందజేత

చీరాల రూరల్: అనాథ వృద్ధాశ్రమానికి చీరాల ఎస్‌ఆర్‌అండ్‌పిఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యుడు శ్రీరాం చెంగలరాయుడు హరిప్రసాద్ నగర్‌లోని కోటయ్య అనాథ వృద్ధాశ్రయానికి రెండు బస్తాల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలలో భాగంగా దాతలు చేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలని అనాథలను ఆదుకోవాటం ఎంతో సంతృప్తిగా ఉందని వారు చెప్పారు.

15న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మార్కాపురం టౌన్: అరుణాచల పుణ్యక్షేత్రానికి మార్కాపురం ఆర్టీసీ డిపో ద్వారా ఈ నెల 15న ప్రత్యేక బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. 15వ తేదీ రాత్రి 9 గంటలకు మార్కాపురం నుంచి బయల్దేరి కానిపాకం, తిరుత్తణి, కంచి మీదుగా అరుణాచలం వెళ్తుందని, గిరి ప్రదక్షిణ అనంతరం 17వ తేదీ బయల్దేరి గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత మార్కాపురం చేరుకుంటుందని వివరించారు. చార్జీ రూ.2500గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సులోనే సురక్షితంగా ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: శాఖా గ్రంథాలయ పరిధిలో విద్యార్థులకు నిర్వహించనున్న వేసవి శిక్షణా శిబిరం పోస్టర్‌ను ఆదివారం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆవిష్కరించారు. వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా గ్రంథాలయం ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో వై రామాంజనేయులు, పల్లపోలు శ్రీబాబు, బడే వెంకటేశ్వరరెడ్డి, అంకిరెడ్డి, నాగబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అద్దంకి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు చుండూరి సుగుణరావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన చదవటం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.